సాక్షి అనంతపురం

సోమవారం । 18 । డిసెంబర్ । 2023



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో ఆదివారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.



డుమ్మా కొడితే సరెండరే

సర్వసభ్య సమావేశాలకు హాజరుకాని వారిని సరెండర్ చేస్తామని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హెచ్చరించారు.

8లో



జిల్లా అంతటా ఆదివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఉదయం చలి తీవ్రత పెరిగింది. తూర్పు దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న ఆంధ్ర, జార్ఖండ్ మ్యాచ్



మ్యాచ్ జరుగుతున్న దృశ్యం



వస్తల్ తివారీ

అనంతపురం: బీసీసీఐ కూచ్ బెహర్ ట్రోఫీలో భాగంగా అనంత క్రీడాగ్రామం వేదికగా సాగుతున్న ఆంధ్రప్రదేశ్ - జార్ఖండ్ రాష్ట్రాల మధ్య ఆదివారం మూడో రోజు మ్యాచ్ ఉత్కంఠగా సాగింది. జార్ఖండ్ తొలి ఇన్నింగ్స్ 346 పరుగులకు ఆలౌట్ కాగా, రెండో ఇన్నింగ్స్‌లో 188 పరుగులు చేసింది. జట్టు బ్యాటర్ వస్తల్ తివారీ 125 (9 ఫోర్లు) పరుగులతో రాణించారు. ఆంధ్రప్రదేశ్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 50 పరుగులు చేసి మూడు వికెట్లు కోల్పోయింది.

24 నుంచి బ్రహ్మోత్సవాలు





ఆంజినేయస్వామి, లక్ష్మీనరసింహస్వామి

మడకశిరరూరల్: జిల్లాలోనే అత్యంత ప్రసిద్ధి గాంచిన భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి, జిల్లెడుగుంట ఆంజినేయస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 24న ధ్వజారోహణ, అంకుర్పాణ, అభిషేకం, హనుమత్ వ్రతం, 25న స్వామి వార్ల కల్యాణోత్సవం, 26న స్వామివార్ల బ్రహ్మ రథోత్సవం, 27న భూతప్పలు, జ్యోతుల ఉత్సవం, 28న పూల పల్లకీ, ముత్యాల పల్లకీ, గరుడోత్సవం, 29న శయనోత్సవం, ఉయ్యాలోత్సవం, 30న వసంతోత్సవం, చక్రస్నానం తదితర కార్యక్రమాలు జరుగుతాయి. అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.

పండుగలా ఉత్సవాలు

మడకశిర మండలం హరేసముద్రం పంచాయతీ పరిధిలోని భక్తరపల్లిలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. ఇక్కడి నుంచి కిలో మీటర్ దూరంలో వైబీ హళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జిల్లెడుగుంట గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం ఉంది. ఈ రెండు పంచాయతీల పరిధిలోని గ్రామాల ప్రజలు స్వామి వార్ల బ్రహోత్సవాలకు ప్రతి కుటుంబం ఇళ్లను శుభ్రం చేసుకోవడంతో పాటు నూతన దుస్తులు ధరించి పండుగలా ఉత్సవాలను జరుపుకుంటుంది.

భూతప్ప, జ్యోతుల ఉత్సవాలే ప్రధాన ఆకర్షణ

వారం రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా భూతప్ప, జ్యోతుల ఉత్సవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. దీర్ఘకాలికంగా బాధపడుతున్నవారు, సంతానం లేనివారు వేకువజామునే తడిస్నానం చేసి భూతప్పలు వచ్చేదారిలో పడుకుంటారు. భూతప్పలు వారిపై కాలుమోపుతూ ముందుకు సాగుతారు. ఇలా భూతప్పలు కాలుమోపితే వ్యాధులు నయం కావడంతో పాటు సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల నమ్మకం.

మూడంచెల పరిశీలన

- ప్రతి దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో విచారణ
- ఓటు తొలగింపు దరఖాస్తుపై సూక్ష్మ పరిశీలన
- ఆమోదం కోసం ధ్రువీకరణ పత్రాల స్వీకరణ



కసాపురంలో క్లెయిమ్‌ల పరిశీలన ప్రక్రియను తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ–2024 కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేలో అందిన క్లెయిమ్‌లు... రాజకీయ పార్టీల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించే విషయంలో జిల్లా ఎన్నికల యంత్రాంగం మూడంచెల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తోంది. ఏ చిన్నపొరపాటు జరిగినా ఎన్నికల కమిషన్ తీవ్రంగా పరిగణిస్తున్న నేపథ్యంలో క్లెయిమ్‌ల పరిశీలన, విచారణ, పరిష్కారం ప్రక్రియలను అధికారులు అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

ఓటరు నమోదు దరఖాస్తు పరిశీలన ఇలా...

కొత్తగా ఓటరు నమోదుకు (ఫారం-6) అందిన దరఖాస్తులపై బీఎల్‌ఓ క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారుని ఇంటికి వెళ్లి వయసు ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలిస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండినట్లయితే వారితో సంతకం తీసుకుని ధ్రువీకరణ పత్రాలను జత చేసి ఏఈఆర్‌ఓకు సమర్పిస్తున్నారు. వాటిని ఏఈఆర్‌ఓ పరిశీలించి ఆమోదం కోసం ఈఆర్‌ఓకు సమర్పిస్తున్నారు. దరఖాస్తును ఈఆర్‌ఓ పరిశీలించి అంగీకరించడం లేదా తిరస్కరించడం చేస్తున్నారు.

ఓట్ల తొలగింపునకు సూక్ష్మ పరిశీలన..

ప్రధానంగా ఓట్ల తొలగింపునకు (ఫారం-7) అందిన క్లెయిమ్‌పై సూక్ష్మస్థాయిలో పరిశీలిస్తూ అత్యంత పారదర్శకంగా విచారణ చేస్తున్నారు. మృతి చెందిన ఓటర్లను తొలగించేందుకు బీఎల్‌ఓలో క్షేత్రస్థాయిలో విచారణ చేస్తున్నారు. మరణ ధ్రువీకరణ పత్రం లేదా పంచనామా, వారి కుటుంబ సభ్యుల నుంచి రాతపూర్వక వాంగ్మూలం తీసుకున్న తరువాత తొలగించేందుకు ఏఈఆర్‌ఓకు సమర్పిస్తున్నారు. ధ్రువీకరణ పత్రాలను ఏఈఆర్‌ఓ పరిశీలన చేసిన తరువాత తదుపరి చర్యలకు ఈఆర్‌ఓకు సమర్పిస్తున్నారు. దరఖాస్తును ఈఆర్‌ఓ పరిశీలించి అంతా సవ్యంగా ఉన్నట్లు నిర్ధారించుకున్న తరువాత అమోదిస్తున్నారు. తరువాత జాబితా నుంచి ఓటు తొలగిస్తున్నారన్నారు.

జిల్లాలో ఓటరు క్లెయిమ్‌లు ఇలా..				
ఫారం	దరఖాస్తులు	ఆమోదం	తిరస్కరణ	పెండింగ్
ఫారం-6 (ఓటరుగా నమోదు)	1,33,696	92,788	11,512	29,396
ఫారం-7 (ఓటు తొలగింపు)	1,16,004	64,393	17,189	34,422
ఫారం-8 (మార్పులు చేర్పులు)	1,27,798	1,07,570	5,264	14,964

డూప్లికేట్ ఓట్ల తొలగింపు ఇలా...

డూప్లికేట్ ఓట్ల విషయంలో అధికారులు పక్కాగా నిబంధనలు పాటిస్తున్నారు. ఇలాంటి దరఖాస్తులను ఈఆర్‌ఓ తన లాగిన్ ద్వారా ఫార్మెట్-ఎ, ధ్రువీకరణ లేఖను సంబంధిత ఓటరుకు స్పీడ్ పోస్టు ద్వారా పంపిస్తున్నారు. ఓటరు ఏ ఓటును జాబితా నుంచి తొలగించాలని ధ్రువీకరణ లేఖ ఇస్తారో దానిని తొలగిస్తున్నారు. వీటికి 15 రోజుల గడువు ఉంటుంది. ఆ తరువా కూడా ఓటరు సమాధానం ఇవ్వకపోతే బీఎల్‌ఓ నేరుగా ఓటరు ఇంటి వెళ్లి విచారణ చేసి డూప్లికేట్ ఓటు తొలగించేందుకు ధ్రువీకరణ లేఖను తీసుకుని ఏఈఆర్‌ఓకు సమర్పిస్తున్నారు. ఏఈఆర్‌ఓ పరిశీలించి ఈఆర్‌ఓకు పంపుతున్నారు. వాటిని ఈఆర్‌ఓ పరిశీలించి డూప్లికేట్ ఓటును తొలగిస్తున్నారు.

- ఓటరు జాబితాలో ఓటర్ల శాశ్వత నివాసం మార్పు ఉంటే.. వారికి ఈఆర్‌ఓ ఫార్మెట్-బి ద్వారా ధ్రువీకరణ లేఖ తయారు చేసి సంబంధిత ఓటరుకు స్పీడ్ పోస్టు ద్వారా పంపిస్తున్నారు. వీటికి 15రోజులు గడువు ఉంటుంది. వీటిని విచారణ కోసం బీఎల్‌ఓకు అందిస్తున్నారు. సంబంధిత బీఎల్‌ఓ ఓటరు ఇంటికి వెళ్లి విచారణ చేస్తున్నారు. తెలిపిన చిరునామాలో ఓటరు నివాసం లేని పక్షంలో చుట్టుపక్కల వారితో రాతపూర్వక వాంగ్మూలం తీసుకుని.. చిరునామాలో నివాసం లేరని ధ్రువీకరించుకున్న తరువాత ఓటును తొలగించేందుకు ఏఈఆర్‌ఓకు సమర్పిస్తారు. దరఖాస్తును, ధ్రువీకరణ ప్రతాన్ని ఏఈఆర్‌ఓ పరిశలించి ఈఆర్‌ఓకి సమర్పిస్తారు. వాటిని ఈఆర్‌ఓ పరిశీలించి సక్రమంగా ఉన్నట్లు నిర్ధారణకు వస్తే ఆమోదిస్తూ జాబితా నుంచి ఓటు తొలగిస్తారు.

మార్పులు... చేర్పులు ఇలా...

ఓటరు జాబితాలో ఏవైనా సవరణ (పేరు, చిరునామా, పుట్టిన తేదీ, తదితరమైనవి) కోసం (ఫారం-8) వచ్చిన దరఖాస్తులను బీఎల్‌ఓ విచారణ చేస్తారు. దరఖాస్తుదారు ఇంటికి బీఎల్‌ఓ వెళ్లి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి.. వారితో సంతకం తీసుకుని ధ్రువీకరణ పత్రాలను జత చేసి ఆమోదం కోసం ఏఈఆర్‌ఓకు సమర్పిస్తారు. వాటిని ఏఈఆర్‌ఓ పరిశీలించి ఆమోదం కోసం ఈఆర్‌ఓకు పంపిస్తారు. వాటిని ఈఆర్‌ఓ పరిశీలించి ఆమోదించడం లేదా తిరస్కరించడం చేస్తారు.

పారదర్శకంగా క్లెయిమ్‌ల పరిష్కారం



ఓటరు జాబితా సవరణలో భాగంగా అందిన క్లెయిమ్‌ల పరిష్కారంలో పారదర్శకంగా వ్యవహరిస్తున్నాం. ముఖ్యంగా ఓట్ల తొలగింపు దరఖాస్తులపై సూక్ష్మస్థాయిలో పరిశీలన చేయిస్తున్నాం. ప్రతి దరఖాస్తుపై మూడంచెల పరిశీలన ఉంటుంది. క్షేత్రస్థాయిలో బీఎల్‌ఓ పరిశీలించి ధ్రువీకరణ పత్రాలను తీసుకుంటారు. వాటిని ఏఈఆర్‌ఓకు సమర్పిస్తారు. వాటిని ఏఈఆర్‌ఓ పరిశీలన పూర్తి చేసి ఆమోదం కోసం ఈఆర్‌ఓకు పంపిస్తారు. వాటిని ఈఆర్‌ఓ పరిశీలించి సక్రమంగా ఉంటే ఆమోదిస్తారు. లేదంటే తిరస్కరిస్తారు. ఏ చిన్న తప్పిదానికి తావివ్వకుండా ఈ ప్రక్రియను అత్యంత పకడ్బందీగా నిర్వహిస్తున్నాం.

– గౌతమి, కలెక్టర్

వైభవంగా కనకదాస విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం



భక్త కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ మాధవ్, ఎమ్మెల్యేలు కేతిరెడ్డి, శంకరనారాయణ

ధర్మవరం: కురుబల ఆరాధ్య దైవం కనకదాస విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం పట్టణంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కురుబలు తరలివచ్చారు. స్థానిక కళాజ్యోతి సర్కిల్ వద్ద పట్టణ కురుబ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎమ్మెల్యేలు కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్య ప్రకాష్‌బాబు, కురుబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బోరంపల్లి ఆంజనేయులు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కురుబల అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయంగా పదవులు కల్పించి పెద్దపీట వేశారన్నారు. కురుబలంతా సంఘటితంగా ఉండాలన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు భక్త కనకదాసు అన్నారు. కవిత్వంతో మూఢనమ్మకాలను, దురాచారాలను రూపుమాపారని కొనియాడారు. ఆ మహనీయున్ని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ధర్మవరంలోని ముఖ్య ప్రాంతంలో విగ్రహ ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యే కేతిరెడ్డికి పలువురు కురుబ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

వకీల్ పెదయ్య కాంప్లెక్స్‌గా నామకరణం..

కళాజ్యోతి సర్కిల్ వద్ద నిర్మిస్తున్న మున్సిపల్ వాణిజ్య సముదాయానికి ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ తండ్రి ధర్మవరం మున్సిపల్ మాజీ చైర్మన్ మాలగుండ్ల పెదయ్య (వకీల్ పెదయ్య) కాంప్లెక్స్‌గా నామకరణం చేస్తున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి వెల్లడించారు.

తెల్లారిన బతుకులు



ప్రమాద స్థలంలో లారీలు

రాత్రిపూట టైరు పంక్చరై రోడ్డుపైనే ఆగి ఉన్న లారీకి ఎటువంటి పార్కింగ్ సిగ్నల్స్ వేయక పోవడం.. వేగంగా వచ్చిన మరో లారీ దీన్ని గమనించకుండా వెనుకనుంచి ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం సంభవించింది. ఇద్దరు కూలీలు, లారీ డ్రైవర్ దుర్మరణం చెందారు.

- కురుగుంట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- రోడ్డుపై ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ
- అక్కడికక్కడే ముగ్గురు మృత్యువాత
- మృతులు కర్ణాటక ప్రాంతం హిరియూరు వాసులు







మృతి చెందిన మహలింగ, లింగరాజు, డ్రైవర్ ప్రశాంత్,



చికిత్స పొందుతున్న సుభాష్ చంద్రబోస్

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కురుగుంట సమీపంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు కర్ణాటక రాష్ట్రం హిరియూరు ప్రాంతానికి చెందినవారు. పోలీసులు తెలిపిన మేరకు... శనివారం రాత్రి తాడిపత్రి నుంచి కళ్యాణదుర్గం వైపు వెళ్తున్న బండల లారీ కురుగుంట సమీపంలో టైర్ పంక్చర్ కావడంతో రోడ్డుపైనే ఆగిపోయింది. దీనిని రోడ్డు పక్కకు తీసుకెళ్లడం కానీ, సిగ్నల్స్ వంటి భద్రతా చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. కర్ణాటక ప్రాంతం హిరియూరుకు చెందిన లారీ పశువుల దాణా అనంతపురంలో అన్‌లోడ్ చేసి ఆదివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో తిరుగు పయనమైంది. 2.30 గంటల సమయంలో అనంతపురం దాటిన తర్వాత ఆగి ఉన్న బండల లారీని వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హిరియూరుకు చెందిన లారీ డ్రైవరు ప్రశాంత్ (25), కూలీలు మహలింగ (28), లింగరాజు (23) అక్కడికక్కడే చనిపోయారు. డ్రైవర్ స్నేహితుడు సుభాష్ చంద్రబోస్ గాయాలతో బయటపడ్డాడు.

స్పందించిన '108' సిబ్బంది..

అటుగా వస్తున్న 108 వాహన సిబ్బంది లారీ ప్రమాద ఘటనను చూసి ఆపారు. పోలీసులకు సమాచారం అందించి గాయాలపాలైన సుభాష్ చంద్రబోస్‌ను ఆస్పత్రికి తరలించారు. అనంతపురం రూరల్ సీఐ రామకృష్ణారెడ్డి, ఇటుకలపల్లి సీఐ నరేంద్రరెడ్డి, ఎస్‌ఐలు, సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. జేసీబీ సాయంతో తెల్లవారుజామున 3 గంటల నుంచి 5 గంటల వరకు శ్రమించి ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం సర్వజనాస్పత్రికి తరలించారు.

అతి వేగమే కారణమా?

ఇంత పెద్ద ప్రమాదానికి లారీ అతి వేగమే కారణమని పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు రోడ్డుపై ఆగి ఉన్న బండల లోడు లారీకి పార్కింగ్ సిగ్నల్స్ వేయకపోవడంతో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ గమనించక బలంగా ఢీకొందని పోలీసులు చెబుతున్నారు. టైరు పంక్చర్ కావడంతో రోడ్డుపైనే వాహనం ఆగిపోయిందని, ఇలాంటి సమయంలో డ్రైవర్ కనీస జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సీఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. రాత్రివేళల్లో అతివేగం చాలా ప్రమాదకరమన్నారు.

'పరివర్తన'తో గౌరవప్రద జీవితం

- అక్రమ మద్యం, నాటుసారా నిర్మూలనపై ప్రత్యేక దృష్టి
- ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పనకు చర్యలు
- బ్యాంకులు, వివిధ పథకాల ద్వారా రుణాలు



డీఆర్‌డీఏ కార్యాలయం

అనంతపురం: అక్రమ మద్యం, నాటుసారా తయారీ, విక్రయాల నియంత్రణపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అక్రమ మద్యం, నాటుసారా విక్రేతలకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించి సమాజంలో గౌరవప్రద జీవనం సాగించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ద్వారా 'పరివర్తన' కార్యక్రమం అమలు చేస్తోంది. ఇందు కోసం బ్యాంకులు, వైఎస్సార్ చేయూత, ఆసరా, స్త్రీనిధి, ఉన్నతి, ముద్ర, సీఐఎఫ్ రుణాల ద్వారా స్వయం ఉపాధి కల్పిస్తోంది. జిల్లాలో 12 మండలాల్లో 121 మంది లబ్ధిదారులకు రూ.1,01,64,000 రుణసాయం చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ ఐ.నరసింహారెడ్డి తెలిపారు.

మండలం	లబ్ధిదారుల సంఖ్య	రుణ మొత్తం
ఆత్మకూరు	3	రూ.1,60,000
బెళుగుప్ప	26	రూ.22,70,000
గుత్తి	13	రూ.11,57,000
గుంతకల్లు	10	రూ.6,74,000
కళ్యాణదుర్గం	10	రూ.10,50,000
కంబదూరు	2	రూ.1,00,000
పామిడి	29	రూ.2,59,2000
రాయదుర్గం	1	రూ.60,000
శింగనమల	2	రూ.1,50,000
తాడిపత్రి	11	రూ.9,30,000
వజ్రకరూరు	7	రూ.5,81,000
యాడికి	7	రూ.4,40,000
మొత్తం	121	రూ.1,01,64,000

గౌరవం పెరిగింది



డీఆర్‌డీఏ అధికారులు రూ.1,05,000 రుణం మంజూరు చేయడంతో 10 గొర్రెలు కొనుగోలు చేశాం. సబ్సిడీ మొత్తం పోగా రూ.35 వేల ఆదాయం వచ్చింది. పొదుపు చేసుకుని మరిన్ని గొర్రెలు కొనుగోలు చేయాలని భావిస్తున్నాం. మా పిల్లలను బాగా చదివిస్తున్నాం. సమాజంలో గౌరవ ప్రతిష్టలు పెరిగాయి.

– త్రివేణి బాయి, బెళుగుప్ప

పొట్టేళ్ల పెంపకం బాగుంది



మేము నాటుసారా అమ్మేవాళ్లం. ప్రత్యామ్నాయ ఉపాధిపై డీఆర్‌డీఏ అధికారులు మాకు అవగాహన కల్పించారు. 2022 నవంబర్‌లో రూ.60 వేల రుణం మంజూరు చేయడంతో 8 పొట్టేళ్ల పిల్లలను కొనుగోలు చేశాం. రూ.30 వేల సబ్సిడీ వచ్చింది. పొట్టేళ్లను అమ్మడంతో రూ.92 వేలు వచ్చింది. సబ్సిడీ రూ.30 వేలు, రూ.32 వేల లాభం మొత్తం రూ.62 వేలతో తిరిగి మరికొన్ని పొట్టేళ్లను కొనుగోలు చేశాం. ప్రత్యామ్నాయ ఉపాధితో సంతోషంగా ఉంది.

– రాజమణిబాయి, నరసాపురం, బెళుగుప్ప మండలం

పరివర్తన తీసుకొచ్చారు

నా భర్త హనుమంతునాయక్ గతంలో రాకెట్లలో నాటుసారా అమ్మేవాడు. పోలీసు దాడులతో భయం భయంగా ఉండేది. ఈ పనిని వదిలి పరివర్తన చెందేలా అధికారులు మాలో మార్పు తెచ్చారు. గతేడాది నవంబర్‌లో 60 వేల రుణం ఇచ్చారు. అందులో రూ.30 వేల సబ్సిడీ వచ్చింది. రుణం తీసుకున్న సొమ్ముతో 8 పొట్టేళ్ల మార్చిలో అమ్మగా లక్ష రూపాయలు వచ్చింది. మొత్తం 70 వేల నికర ఆదాయం వచ్చింది. పొట్టేళ్ల పెంపకంతో వ్యాపారాన్ని మరింత వృద్ధి చేసుకోవాలనుకుంటున్నా.

– ఎం. సాలమ్మ, రాకెట్ల తండా, ఉరవకొండ మండలం

పరిటాల.. డీలా!



- తల్లి, కుమారుడిలో అంతర్మథనం
- రాప్తాడులో వెంటాడుతున్న ఓటమి భయం
- ధర్మవరంలో సొంత కులం నుంచే విముఖత
- పెనుకొండలో పాగా వేయాలని శ్రీరామ్ ప్లాన్!
- వెంట వచ్చేందుకు కార్యకర్తల ససేమిరా
- దిక్కుతోచని స్థితిలో విలవిల

సాక్షి, పుట్టపర్తి:

తెలుగుదేశం పార్టీలో దాదాపు మూడు దశాబ్దాల పాటు వెలిగిన పరిటాల కుటుంబం అయోమయంలో పడింది. గత ఎన్నికల్లో రాప్తాడులో ఓటమితో రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలింది. కొత్తగా అరంగేట్రం చేసిన శ్రీరామ్ రాప్తాడు కాదని.. దొరికిందే అదనుగా ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు తీసుకున్నారు. అయితే అక్కడ కూడా సొంత సామాజికవర్గం నుంచే పోట్లు ఎదురవుతున్నాయి. ఫలితంగా ధర్మవరంలో ఉండలేక.. రాప్తాడుకు రాలేక.. పరిటాల రవీంద్ర, సునీతను గెలిపించిన పెనుకొండ నుంచి పోటీ చేయాలని సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. అయితే బీసీ ఓటర్లు ఎక్కువగా ఉండే ఆ నియోజకవర్గంలో పరిటాల కుటుంబానికి టికెట్ ఇస్తారా? లేదా? అనేది టీడీపీ శ్రేణుల్లో చర్చనీయాంశంగా మారింది. ఓ వైపు బీసీ సామాజిక వర్గానికి చెందిన బీకే పార్థసారథి, సవితమ్మ మధ్య టికెట్ పోటీ నెలకొంది. ఇలాంటి పరిస్థితుల్లో శ్రీరామ్‌కు ఎక్కడి నుంచి టికెట్ ఇస్తారనే దానిపై స్పష్టత కరువైంది.

ఉన్నదీ పాయె..

రాప్తాడులో ఓటమితో నియోజకవర్గ ప్రజలను పరిటాల కుటుంబసభ్యులు పట్టించుకోలేదు. దీంతో వారి వెంట నడిచేందుకు కార్యకర్తలు ఉత్సుకత చూపలేదు. ధర్మవరం ఇన్‌చార్జ్‌గా పరిటాల శ్రీరామ్ కొనసాగుతున్నా.. ఉంటారో.. లేక సొంత నియోజకవర్గానికి వెళ్తారో అనే అనుమానంతో సొంత సామాజిక వర్గం వారే తలోదారి చూసుకుంటున్నారు. దీనికి తోడు బీజేపీ నేత వరదాపురం సూరి (గోనుగుంట్ల సూర్యనారాయణ) త్వరలో టీడీపీలో చేరతారనే ప్రచారం సాగుతోంది. ధర్మవరం నుంచి ఆ పార్టీ తరపున పోటీ చేసేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం. ఒకవేళ టికెట్ రాకున్నా.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలనే భావనతో ఉన్నట్లు తెలిసింది.

స్వయంకృతాపరాధమే..

హిందూపురం పార్లమెంటులో ఒకప్పుడు కీలకంగా వ్యవహరించిన పరిటాల కుటుంబ సభ్యులకు టికెట్ కష్టాలు రావడం స్వయంకృతాపరాధమేనని చెబుతున్నారు. అన్నీ తామై వ్యవహరించడం, జిల్లా రాజకీయాలను శాసించాలనే అత్యాశకు పోవడంతో కార్యకర్తలు దూరమైనట్లు చెబుతారు. అధికారంలో ఉన్న సమయంలో కేవలం సొంత సామాజికవర్గానికి అనుకూలంగా పని చేయడం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను పట్టించుకోకపోవడం కూడా వారి ఓటమికి కారణాలని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఓడినా.. సొంత సామాజిక వర్గంవారికే ప్రాధాన్యత ఇస్తుండడంతో ఇతర సామాజికవర్గాల నుంచి పరిటాల కుటుంబానికి చేదు అనుభవం ఎదురవుతోంది.

రెండు చోట్లా వ్యతిరేకతే..

రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జ్‌లుగా పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ కొనసాగుతున్నారు. అయితే రెండు చోట్లా ఇద్దరిపై భారీ వ్యతిరేకత ఉంది. కార్యకర్తలను పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని చెబుతున్నారు. పార్టీలకు అతీతంగా.. అర్హతే ప్రామాణికంగా టీడీపీ కార్యకర్తలకు సైతం సంక్షేమ ఫలాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోంది. దీంతో ఇప్పటికే చాలా మంది వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఫలితంగా రాప్తాడు, ధర్మవరంలో పరిటాల కుటుంబ సభ్యులు గెలవడం కష్టమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.



అక్కడా కష్టమేనా..!

బీసీ ఓటర్లు అధికంగా ఉన్న పెనుకొండ నుంచి పరిటాల కుటుంబ సభ్యులు పోటీ చేసినా ఘోర పరాభవం తప్పదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. బీసీ కులాలకు చెందిన నిమ్మల కిష్టప్ప, బీకే పార్థసారథి, సవితమ్మ మధ్య సమన్వయం లేకపోవడం కూడా కారణంగా చెప్పవచ్చు. ముగ్గురి మధ్యలోకి పరిటాల శ్రీరామ్ వస్తే.. గ్రూపు తగాదాలతో మరోసారి పరాభవం ఖాయమని చెబుతున్నారు.

నేటి నుంచి డిగ్రీ పరీక్షలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం డిగ్రీ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. వచ్చే జనవరి 13న పరీక్షలు ముగియనున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఐదో సెమిస్టర్, మంగళవారం ఉదయం మొదటి సెమిస్టర్, మధ్యాహ్నం మూడో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం అవుతాయన్నారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక పరిశీలకులను నియమించామన్నారు. పరీక్షల్లో అవకతవకలు పాల్పడకుండా చర్యలు తీసుకున్నామన్నారు. మాస్ కాపీయింగ్ ప్రోత్సహిస్తే సంబంధిత పరీక్ష కేంద్రాలను రద్దు చేస్తామన్నారు. గతంలో రద్దు చేసిన పరీక్ష కేంద్రాలపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు.

2019 లో 1,2,3,4,5 ర్యాంకులతో పాటు 600 పైగా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన సంస్థ
GROUP-I,II
తేజ రఘువీర టవర్స్, అనంతపురము 9948567527, 9490859421 హాస్టల్ కలదు

GROUP-I, II ఫ్రీ డెమో క్లాసులు 18 & 19 తేదీలలో @ 9 AM - 5 PM
డెమో క్లాసులకి హాజరైన వారికి మెటీరియల్ ఫ్రీ
అనంత భవిత IAS అకాడమి
L.S టవర్స్, లలిత కళాపరిషత్ ఎదురుగా అనంతపురము. 7997592299

క్లుప్తంగా

ఎంపీఆర్‌లో యువకుడి గల్లంతు

గార్లదిన్నె: మండలంలోని పెనకచెర్ల వద్ద ఉన్న మిడ్ పెన్నార్ రిజర్వాయర్ (ఎంపీఆర్)లో ఓ యువకుడు గల్లంతయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.... ఉరవకొండ మండలం అంబేడ్కర్ నగర్‌కు చెందిన ధనుంజయ కుమారుడు ఆర్య, తన స్నేహితులు ఏడుగిరితో కలసి ఆదివారం ఉదయం ఎంపీఆర్ సందర్శనకు వచ్చాడు. మత్స్యకారుల చేపల వేటకు ఉపయోగించే తెప్పలను చూడగానే నలుగురు ఓ దానిలో, మరొకదానిలో ముగ్గురు చొప్పున కూర్చొని రిజర్వాయర్‌లోకి వెళ్లారు. మధ్యలోకి వెళ్లిన తర్వాత తెప్ప అదుపు తప్పడంతో ఆర్య నీళ్లలో పడిపోయాడు. అప్రమత్తమైన మిగిలిన స్నేహితులు తెప్పలో ఒడ్డుకు చేరుకుని జరిగిన ఘటనను స్థానికులు తెలిపి వారి సాయంతో ఆర్య కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. విషయం తెలుసుకున్న గార్లదిన్నె పోలీసులు అక్కడకు చేరుకుని మత్స్యకారులు, గజ ఈతగాళ్ల సాయంతో గాలింపు చేపట్టారు.

ఎంఈఓల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రవి


రవినాయక్

అనంతపురం ఎడ్యుకేషన్: మండల విద్యాశాఖ అధికారుల (ఎంఈఓ-1) సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుత్తి ఎంఈఓ బుక్కా రవినాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం 'గూగుల్ మీట్'లో జరిగింది. ఎంఈఓల సమస్యలపై చర్చించిన అనంతరం రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా మన్యం జిల్లాకు చెందిన ఎస్.సింహాచలం ఎన్నికకాగా, ప్రధానకార్యదర్శిగా బుక్కా రవినాయక్ నియమితులయ్యారు.

వివాహిత ఆత్మహత్య

పామిడి: మండలంలోని దేవరపల్లి గ్రామానికి చెందిన రామాంజనమ్మ(45) ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... దాదాపు 20 ఏళ్ల క్రితం రామాంజనమ్మకు వైఎస్సార్ జిల్లా రైల్వేకొండాపురం మండలం రేపల్లెకు చెందిన శ్రీరాములుతో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. కొన్నేళ్ళుగా తీవ్ర తలనొప్పితో బాధపడుతున్న రామాంజినమ్మకు కుటుంబసభ్యులు వైద్యం చేయిస్తున్నారు. అయినా నయం కాలేదు. ఈ క్రమంలో గత శనివారం పుట్టింటికి వచ్చిన ఆమె ఆదివాం తలనొప్పి భరించలేక ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పామిడి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఉరవకొండ: స్థానిక రేణుమాకుపల్లి రోడ్డులోని రైస్‌మిల్ సమీపంలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో నింబగల్లు నివాసి సంజన్న(48) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు ఉరవకొండ నుంచి నింబగల్లుకు ఆదివారం ద్విచక్రవాహనంలో మరో ఇద్దరితో కలసి వెళుతున్న సంజన్న... రేణుమాకులపల్లి రోడ్డులో ప్రయాణిస్తుండగా కుక్కలు అడ్డుగా రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడ్డారు. గాయపడిన సంజన్న రోడ్డుపై నుంచి పైకి లేస్తున్న సమయంలో వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన మరో ఇద్దరిని స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

డుమ్మా కొడితే సరెండరే

- అధికారులను హెచ్చరించిన జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ
- వాడీవేడిగా స్థాయీ సంఘాల సమావేశాలు
- ఆర్‌అండ్‌బీ అధికారుల పని తీరుపై సభ్యుల మండిపాటు


ఆర్‌అండ్‌బీ అధికారులను నిలదీస్తున్న కంబదూరు జెడ్పీటీసీ సభ్యుడు నాగరాజుకు నచ్చజెబుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: మూడు నెలలకోసారి జరిగే స్థాయీ సంఘాల, జెడ్పీ సర్వసభ్య సమావేశాలకూ హాజరు కాని ముఖ్య అధికారులను ప్రభుత్వానికి సరెండర్ చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ హెచ్చరించారు. పని చేయాలనుకుంటే బాధ్యతతో వ్యవహరించాలని, లేకుంటే జిల్లా నుంచి వేరే ప్రాంతాలకు బదిలీ చేయించుకుని వెళ్లిపోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లా పరిషత్‌కు సంబంధించి స్థాయీ సంఘం-1, 2, 4, 7 (ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/విద్య, వైద్యం/ఇంజినీరింగ్ శాఖలు) సమావేశాలు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ అధ్యక్షతన స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ భవన్‌లో ఆదివారం జరిగాయి. డిప్యూటీ సీఈఓ లలితాబాయి చర్చను ప్రారంభించారు.

ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ గైర్హాజరుపై సీరియస్..

తొలుత ఆర్‌అండ్‌బీ శాఖపై చర్చ మొదలుకాగానే కంబదూరు, శెట్టూరు జెడ్పీటీసీ సభ్యులు గుద్దెళ్ల నాగరాజు, మంజునాథ మాట్లాడారు. తమ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లకు అడ్డొస్తున్నాయనే సాకుతో ఆర్‌అండ్‌బీ స్థలాల్లోని భారీ వృక్షాలను విద్యుత్ శాఖ కాంట్రాక్టర్లు అక్రమంగా నరికేసి, కలపను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. అంతేకాక జంగిల్ క్లియరెన్స్ పేరుతో బిల్లులూ డ్రా చేసుకుంటున్నారన్నారు. ఇష్టారాజ్యంగా వృక్షాలను నరికేస్తున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. అంతేకాక ఆర్‌అండ్‌బీ రోడ్లు కంకర తేలి, మోకాలి లోతు గుంతలతో నిండిపోయాయని, తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, మరెంతో మంది వికలాంగులుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరైన కింది స్థాయి అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ కల్పించుకుని ఎస్‌ఈ గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశాలకు 15 రోజుల ముందే సమాచారం ఇస్తున్నా తప్పించుకోవడం సబబు కాదన్నారు. ఇలాగైతే ప్రభుత్వానికి సరెండర్ చేస్తామన్నారు. గాండ్లపెంటలో రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసినట్లు రికార్డులు సృష్టించి, నిధులు మింగేశారని జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ఫయాజ్ ఆరోపించారు. ఈ అంశంపై సమగ్ర విచారణ చేసి స్వాహారాయుళ్లను శిక్షించాలని డిమాండ్ చేశారు.

పొదుపు సొమ్ము ఎలా దిగమింగుతారు?

చాలా ప్రాంతాల్లో డ్వాక్రా సంఘాల పొదుపు సొమ్ము స్వాహా చేసిన ఉదంతాలపై గత సమావేశాల్లో చర్చించామని సభ్యులు గుర్తు చేస్తూ దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలంటూ ఉభయ జిల్లాల డీఆర్‌డీఏ పీడీలు నరసింహారెడ్డి, నరసయ్యను నిలదీశారు. వారిచ్చిన సమాధానాలతో సభ్యులు సంతృప్తి చెందలేదు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ కల్పించుకుని.. మహిళల పొదుపు సొమ్ము స్వాహా చేసిన వారి నుంచి వెంటనే రికవరీ చేయాలని ఆదేశించారు. లేదంటే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ పాటించేలా చూడాల్సిన బాధ్యత డీపీఓలు, ఎంపీడీఓలదేనని స్పష్టం చేశారు.

పౌష్టికాహారం అందేలా చూడండి..

ఐసీడీఎస్‌కు సంబంధించిన స్థాయీ సంఘం-5 సమావేశం చైర్‌పర్సన్ హెచ్.హసీనా బాను(డి.హీరేహాళ్) అధ్యక్షతన జరిగింది. అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు సమ్మెబాట పట్టడంతో బాలింతలు, గర్భిణులు, శిశువులకు పౌష్టికాహారం అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు విజయప్రతాప్‌రెడ్డి(యల్లనూరు), రాధ(కదిరి) సభ దృష్టికి తెచ్చారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినందున ఆ దిశగా అధికారులు చొరవ చూపాలని, లబ్ధిదారులకు పౌష్టికాహారం అందేలా చూడాలని కోరారు. దీనిపై ఐసీడీఎస్ పీడీలు డాక్టర్ బీఎస్ శ్రీదేవి(అనంతపురం), లక్ష్మీకుమారి(శ్రీసత్యసాయి జిల్లా) స్పందించారు. సచివాలయ ఉద్యోగులు, ఆశా వర్కర్లు, వలంటీర్లతో కేంద్రాలు తెరిపిస్తున్నామన్నారు.

ఉచిత శిక్షణ నిబంధనలు సడలించండి..

జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ అధ్యక్షత వహించిన సాంఘిక సంక్షేమ శాఖకు సంబంధించిన స్థాయీ సంఘం-6 సమావేశంలో కూడేరు జెడ్పీటీసీ సభ్యురాలు బీఎస్ అశ్విని మాట్లాడుతూ.. గ్రూప్-1, 2 పోటీ పరీక్షలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని జిల్లాల్లోనూ బీసీ స్టడీ సెంటర్ల ద్వారా ఉచిత శిక్షణ ఇస్తోందని, అయితే రూ.లక్ష లోపు ఆదాయం ఉన్న వారు మాత్రమే అర్హులని నిబంధనల్లో పేర్కొనడం సబబు కాదన్నారు. ఈసారి వర్షాలు రాక, పంటలు పండక రైతులతో పాటు వ్యవసాయాధిరత రంగాలపై ఆధారపడిన వారు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ అంశాన్ని దృష్టిలో ఉంచుకుని వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉన్న వారికి కూడా ఉచిత శిక్షణకు అనుమతించేలా ప్రభుత్వానికి తీర్మానం చేసి పంపాలని సూచించారు. ఇందుకు సమావేశం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. బీసీ సాంఘిక సంక్షేమ శాఖ డీడీ కుష్బూకొఠారి స్పందిస్తూ.. సభ్యులు అడిగిన అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన స్థాయీ సంఘం-3 సమావేశం గుమ్మఘట్ట జెడ్పీటీసీ సభ్యుడు మహేష్ అధ్యక్షతన నిర్వహించారు. రైతులకు మేలు చేసే నిర్ణయాలు తీసుకోవాలని సభ్యులు కోరారు.

జనవాక్కు

బతుకులు బాగుపడ్డాయి



గత ప్రభుత్వంలో పథకాలు వర్తించక చాలా ఇబ్బందులు పడ్డాం. పేదలంటే అప్పట్లో అందరికీ చిన్నచూపే. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత మా బతుకులు బాగుపడ్డాయి. మాకు వైఎస్సార్ చేయూత పథకం వర్తించింది. ఏటా రూ.18,750 చొప్పున మూడేళ్లు నగదును బ్యాంక్ ఖాతాలోకి జమ చేశారు. ఈ డబ్బుతో ఓ ఆవును కొని, పాల వ్యాపారం చేపట్టాను. ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలుస్తాం. **– బోయ లక్ష్మీదేవి, ఉదిరిపికొండ, కూడేరు మండలం**

సొంతింటి కల నెరవేరింది



మాది ఉమ్మడి కుటుంబం. కొత్తగా ఇల్లు కట్టుకునే ఆర్థిక స్థోమత లేక చాలా కాలంగా ఇరుకు గదిలోనే ఉంటున్నాం. మా పరిస్థితిని వివరిస్తూ గత ప్రభుత్వంలో పలుమార్లు అర్జీలు ఇచ్చినా ఫలితం దక్కలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ఎలాంటి సిఫారసు లేకుండానే మాకు ఇల్లు మంజూరైంది. నిర్మాణం కూడా పూర్తయింది. ఇప్పుడు ఎంతో సంతోషంగా కొత్త ఇంట్లో కాపురం ఉంటున్నాం. సీఎం వైఎస్ జగన్ వల్లనే మా కుటుంబంలో సంతోషాలు నెలకొన్నాయి. **– కవిత, జి.మల్లాపురం, విడపనకల్లు మండలం**

కంటి చూపు బాగుపడింది



కూలి పనులతో జీవనం సాగించే నేను కొంత కాలంగా కంటి చూపు మందగించి చాలా ఇబ్బంది పడ్డాను. డాక్టర్ల దగ్గరకు వెళ్లి వైద్యం చేయించుకునే ఆర్థిక స్తోమత లేదు. ఎలాగోలా అలాగే కాలం నెట్టుకుంటూ వచ్చేవాడిని. ఇటీవల మా ఊళ్లోనే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అక్కడికెళ్లితే డాక్టర్లు పరీక్ష చేసి, అనంతపురానికి తీసుకెళ్లి ఉచితంగా కంటికి ఆపరేషన్ చేశారు. మందులూ ఇచ్చారు. ఇప్పుడు కంటి చూపు బాగుంది. **– లక్ష్మన్న, ఈస్ట్ కోడిపల్లి, కళ్యాణదుర్గం మండలం**

ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి



సీఎం వైఎస్ జగనన్న అమలు చేస్తున్న పథకాలతో మా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు దూరమయ్యాయి. వైఎస్సార్ చేయూత పథకం కింద మూడేళ్లుగా ఏటా రూ.18,750 లబ్ధి చేకూరింది. ఎనిమిదో తరగతి చదువుతున్న మా కుమారుడి పేరుపై అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు బ్యాంక్ ఖాతాలోకి జమ అవుతోంది. రైతు భరోసా పథకం వర్తించడంతో వ్యవసాయ పెట్టుబడులకు అప్పులు చేయాల్సిన పని లేకుండా పోయింది. సీఎం జగనన్న పాలన చాలా బాగుంది. మళ్లీ ఆయనే ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నా. **– లత, శ్రీరంగాపురం, బెళుగుప్ప మండలం**

వైభవంగా సామూహిక వివాహాలు

- చెన్నకేశవస్వామి సన్నిధిలో ఒక్కటైన 27 జంటలు
- వివాహాలు జరిపించిన లండన్‌కు చెందిన ప్రవాసభారతీయులు


వివాహ వేడుకకు హాజరైన బంధుమిత్రులు

పుట్టపర్తి అర్బన్: కొత్తచెరువు మండలం చెన్నకేశవపురంలోని చెన్నకేశవస్వామి సన్నిధిలో ఉచిత వివాహాల సందడి నెలకొంది. లండన్‌లో స్థిరపడిన ప్రవాసభారతీయులు, సత్యసాయి భక్తులు అనిల్‌పటేల్, అనిలా పటేల్ దంపతుల సహకారంతో పుట్టపర్తి పట్టణానికి చెందిన చల్లా సాయికృష్ణ నేతృత్వంలో ఉచిత సామూహిక వివాహాలు శాస్త్రోక్తకంగా ఆదివారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా నిరుపేద కుటుంబాలకు చెందిన 27 జంటలు ఒకే వేదికపై ఒక్కటయ్యాయి. నిర్వాహకులు బంగారు తాళిబొట్టు, గిన్నెబొట్టు, వెండి మెట్టెలు, పట్టు వస్త్రాలు అందించారు. విచ్చేసిన వేలాది మంది బంధుమిత్రులకు భోజన సదుపాయాలు కల్పించారు. ముఖ్య అతిధిగా సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, నిర్వాహకులు అనిల్ పటేల్ దంపతులు, రెస్కో మాజీ చైర్మన్ దుద్దుకుంట వెంకట్రామిరెడ్డి హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఆయా కుటుంబాలకు వంట సామగ్రిని అందించారు. వివాహ కార్యక్రమానికి విచ్చేసిన విదేశీయులు వధూవరులకు స్వయంగా నగదు, జత వాచీలు బహూకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పలువురు విదేశీయులు పాల్గొన్నారు.


నవదంపతులతో నిర్వాహకులు, ముఖ్య అతిథులు


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఆర్‌జే రత్నాకర్

దంపతుల ఆత్మహత్యాయత్నం

- భర్త మృతి
- ప్రాణాపాయం నుంచి బయటపడ్డ భార్య

హిందూపురం అర్బన్: క్షణికావేశంతో దంపతులు ఆత్మహత్యాయత్నం చేయగా భర్త మృతి చెందాడు. ప్రాణాపాయం నుంచి భార్య బయటపడింది. వివరాలు... హిందూపురంలోని వీవర్స్ కాలనీలో నివాసముంటున్న బాబ్జాన్ (31), షకీల దంపతులకు ఆరేళ్ల వయసున్న కుమార్తెతో పాటు ఐదేళ్ల వయసున్న కుమారుడు ఉన్నారు. తోపుడుబండిపై కూరగాయలు, పండ్ల వ్యాపారంతో జీవనం సాగించేవారు. శనివారం రాత్రి చిన్నపాటి విషయానికి దంపతులు గొడవపడ్డారు. ఆదివారం ఉదయం కూడా గొడవ కొనసాగడంతో పిల్లలను సమీపంలోనే నివాసముంటున్న తాత వద్దకు పంపారు. అనంతరం ఇంటి పైకప్పుకు రెండు చీరలతో ఉరి వేసుకున్నారు. పిల్లలిద్దరు ఒంటరిగా ఇంటి వద్దకు చేరుకోవడంతో తాత ఆరా తీయడంతో రాత్రి నుంచి అమ్మ, నాన్న గొడవ పడుతున్నారని తెలిపారు. దీంతో ఆయన వెంటనే కుమారుడి ఇంటి వద్దకు చేరుకున్నాడు. ఉరికి వేలాడుతున్న దంపతులను చూడగానే గట్టిగా కేకలు వేసి, చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయడంతో వారు అక్కడకు చేరుకుని ఉరికి వేలాడుతున్న దంపతులను కిందకు దించారు. అప్పటికే బాబ్జాన్ మృతి చెందినట్లు నిర్ధారించుకున్నారు. కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న షకీలాను వెంటనే ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. క్షణికావేశమే ఘటనకు కారణంగా ప్రాథమిక దర్యాప్తులో తేలింది.

వలస కూలీ అనుమానాస్పద మృతి

గోరంట్ల: మండలంలోని పాలసముద్రం సమీపంలో చేపట్టిన నాసిన్ అకాడమీ పనుల్లో పాల్గొన్న మధ్యప్రదేశ్‌కు చెందిన లాల్‌జీ కేవత్ (29) ఆదివారం రాత్రి అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. తొలుత తీవ్ర గాయాలతో బాధపడుతున్న లాల్‌జీ కేవత్‌ను వెంటనే కర్ణాటకలోని బాగేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రమాదం ఎక్కడ జరిగింది? ఎలా జరిగింది? అనే అంశాలపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి


నవీన్ (ఫైల్)

గుంతకల్లు రూరల్: పట్టణ శివారులోని దోనిముక్కల ఇందిరమ్మ కాలనీలో ఓ విద్యార్థి గుండెపోటుతో మృతి చెందాడు. వివరాలు.. కాలనీకి చెందిన రమేష్, లక్ష్మిదేవి దంపతుల కుమారుడైన నవీన్(20) గుత్తి గేట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. నవీన్ శనివారం రాత్రి స్నేహితులతో కలిసి సెకెండ్ షో సినిమాకు వెళ్లి రాత్రి ఇంటికి చేరుకొని ఇంటిపైన ఉన్న తన గదిలో నిద్రపోయాడు. ఆదివారం ఉదయం తమ కుమారుడు ఎంతకూ నిద్ర లేవకపోవడంతో తల్లిదండ్రులు పైకి వెళ్లి చూడగా విగత జీవిగా దర్శనమిచ్చాడు. అనుమానం కలిగిన తల్లిదండ్రులు వెంటనే అతడిని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిద్రలో గుండెపోటుకు గురై మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తి మృతి

కదిరి టౌన్: మిద్దెపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.... కదిరిలోని అయ్యప్పనగర్‌లో నివాసముంటున్న రాజారెడ్డి (40)క భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వ్యవసాయంతో కుటుంబాన్ని రాజారెడ్డి పోషించుకుంటుండగా, భార్య టైలరింగ్ పనులతో కుటుబానికి చేదోడుగా ఉంటోంది. ఆదివారం ఉదయం మిద్దెపై నుంచి కిందకు దిగుతున్న రాజారెడ్డి ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. తలకు రక్తగాయాలు కావడంతో వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి కుటుంబసభ్యులు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతిచెందినట్లుగా నిర్ధారించారు. ఘటనపై సీఐ నారాయణరెడ్డి దర్యాప్తు చేపట్టారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


42 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గుత్తి: పట్టణంలోని ఎంఎస్ హైస్కూల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. 1980-81 బ్యాచ్ పదో విద్యార్థులు సుమారు 50 మంది హాజరయ్యారు. నాలుగు దశాబ్దాల అనంతరం కలుసుకోవడంతో భావోద్వేగానికి గురయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. కుశల ప్రశ్నలు వేసుకుని చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు బాచి(శ్రీధర్) మక్బూల్, దేశాయి నాగరాజు, గోవర్దన్‌రెడ్డి, చలమయ్య మాట్లాడుతూ 42 ఏళ్ల తర్వాత చదువుకున్న పాఠశాలలోనే కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

నల్ల తామర నివారణకు చర్యలు చేపట్టండి

- ఉద్యానశాఖ ఏడీ నరసింహారావు


పెద్దవడుగూరు వద్ద రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ ఏడీ నరసింహారావు (ఇన్‌సెట్) మిరప పూతను ఆశించిన నల్లతామర పురుగు

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది నిర్దేశించుకున్న లక్ష్యం కంటే ఎక్కువ విస్తీర్ణంలో సాగులోకి వచ్చిన మిరప పంటను నల్ల తామర పురుగు ఆశించి దెబ్బతీస్తోందని ఉద్యానశాఖ ఏడీ బీఎంవీ నరసింహారావు తెలిపారు. ఇటీవల పలు ప్రాంతాల్లో మిరప పంటను పరిశీలించిన ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ.. చాలా చోట్ల నల్ల తామర పురుగు ఉధృతి కనిపిస్తోందని, తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు. చేపట్టాల్సిన నివారణ చర్యలను ఆయన వివరించారు.

- నల్లి పురుగులు ఆకుల కింది భాగంలో గుడ్లు పెడతాయి. పిల్ల పురుగులు (లార్వాలు) మట్టిలో కలిసిపోయి వృద్ధి చెందిన తర్వాత బయటకు వచ్చి పంటను ఆశిస్తాయి. పూతను ఆశించడం వల్ల పిందె ఏర్పడక దిగుబడులపై గణనీయమైన ప్రభావం పడుతుంది. తామరపురుగు (త్రిప్స్)ను తొలిదశలోనే అరికట్టకపోతే మలిదశలో నల్లతామరను నివారంచడం కష్టం.
- నివారణలో భాగంగా పంట సాగుకు ముందు లోతుగా దుక్కి చేసుకోవాలి. హైబ్రిడ్, స్వల్పకాలిక విత్తన రకాలు ఎంపిక చేసుకోవాలి. పొలం గట్లను శుభ్రంగా ఉంచుకోవాలి. విత్తనశుద్ధి చేయాలి. ఎకరాకు 10 నుంచి 12 టన్నుల పశువుల ఎరువు, రెండు కిలోలు సూడోమోనాస్ కలిపి పొలంలో చల్లుకోవాలి. ఎకరాకు 200 కిలోలు వేపపిండి+500 కిలోలు వర్మీకంపోస్టు వేసుకుంటే తొలి దశలోనే తామర పురుగును నివారించుకునే అవకాశం ఉంటుంది. అలాగే పంట చుట్టూ నాలుగు వరసల రక్షణ పంటగా జొన్న, మొక్కజొన్న, ఎరపంటగా అక్కడక్కడ పొద్దుతిరుగుడు లాంటివి వేసుకోవాలి. ఎకరాకు 25 నుంచి 30 వరకు జిగురు పూసిన నీలిఅట్టలు ఏర్పాటు చేసుకోవాలి.
- సాధ్యమైనంత వరకు పురుగు మందుల జోలికి వెళ్లకుండా మొదటి దశలో 5 శాతం వేపగింజల కషాయం లేదా 10 వేలు పీపీఎం వేపనూనె 2 మి.లీ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. అలాగే 3 మి.లీ కానుగనూనె లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలి. లేదంటే జీవనియంత్రణ మందులైన బవేరియా బాసియానా 5 మి.లీ లేదా 5 మి.లీ వర్టిసీలియం లేదా 30 మి.లీ పంచగవ్య లీటర్ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- పురుగు ఉధృతిని బట్టి రసాయన మందులు వాడాలి. అందులో 0.25 మి.లీ స్పైనోసాడ్ లేదా 1 మి.లీ స్పైనటోరామ్ లేదా 0.75 మి.లీ స్పైరోటెట్రామాట్ లేదా 1.25 మి.లీ డైఫెన్యురాన్ లేదా 2 మి.లీ ఫిప్రానిల్ లేదా 1 మి.లీ థయోమిథాక్సామ్ లాంటివి మందులు మార్చి మార్చి రెండు లేదా మూడు సార్లు పిచికారీ చేసుకుంటే నల్లతామరను సమర్థవంతంగా నివారించుకోవచ్చు.
- కొన్ని ప్రాంతాల్లో తెల్లదోమ కారణంగా మిరపలో బొబ్బరతెగులు ఆశించింది. నివారణకు ఎకరాకు 20 నుంచి 30 వరకు జిగురు పూసిన పసుపు అట్టలు ఏర్పాటు చేయాలి. మొదటి దశ కింద 50 శాతం వేపగింజల కషాయాన్ని పిచికారీ చేయాలి. ఎకరాకు 100 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ లేదా 100 గ్రాములు థయోమిథాక్సామ్ లేదా 100 గ్రాముల అసిటమాప్రిడ్ మందులను మార్చి మార్చి రెండు మూడు సార్లు పిచికారీ చేయాలి.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TOLET

■ ATP, రామ్‌నగర్, 80 ఫీట్ రోడ్డులో అన్ని ఆధునిక వసతులు గల 1300 చ.అ. 2 BHK ఫ్లాట్ బాడుగకు కలదు. సెల్ : 9440060878, 9948660609. [A-1446]

SERVICES

■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు, సిబిల్ అవసరం లేదు. NPA కూడా ధరఖాస్తు. డాల్ఫిన్ ఫైనాన్స్, రాజన్, సెల్: 8437924006. [W-788967]

WANTED

■ SSC / ఇంటర్ (పాస్ / ఫెయిల్) అయిన 36 మంది స్త్రీ / పు లకు మా కంపెనీలో ఉద్యోగాలు జీతం: 14,000 + బోనస్ 6000 + ఫ్రీరూమ్ (నో ఫీజు) సంప్ర: సాయి నగర్, 1 వ క్రాస్ ATP: 97018 64175. [A-7375]

■ మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర।। 9177736926. [M-1221948]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ: 18k. ఫోన్: 9160900024 / 9640400073. [HA-953]

■ WANTED : బెంగళూరు మల్టీ నేషనల్ కంపెనీ INTER, DEGREE, PG అర్హత కలిగి + M.S. OFFICE పై అవగాహన కలిగిన వారు అర్జెంటుగా కావలెను. Salary: ₹30,000 to ₹ 40,000. వెంటనే సంప్రదించండి : సెల్ : 9441185663. [A-2775]

ప్రకటన గోరంత ! స్పందన కొండంత !!
4 లైన్లు రూ: 270/-
అదనపు లైను రూ: 60/-
ANANTHAPURAMU : 9010567770, 9493288307, 9010588846, 9243295650
DHARMAVARAM : 9912220726, 9912220727
HINDUPUR : 9912220723, 9705346587
GUNTAKAL : 9010223701
TADIPATRI : 9912220722
MADAKASIRA : 9010200238
KADIRI : 9010593486
RAYADURG : 9010470185

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

నవతరం విమర్శకుడు అంకె శ్రీనివాస్



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న నారాయణ స్వామి

అనంతపురం కల్చరల్: రాష్ట్ర విభజన అనంతరం సాహిత్య స్వరూపం మారింది. ఈ నేపథ్యంలో నవతరం విమర్శకుడిగా అంకె శ్రీనివాస్ ఎదుగుతుండటం అభినందనీయమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి అన్నారు. యువకవి డాక్టర్ అంకె శ్రీనివాస్ రచించిన 'నాడు–నుడి' 'అస్తిత్వ' అనే రెండు విమర్శ పుస్తకాలను ఆదివారం ఆర్ట్ కళాశాలలో ఆవిష్కరించారు. ఆంధ్రభారతి, స్పందన అనంత కవుల వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆచార్య బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించారు. పుస్తకాల విశిష్టతను తెలియజేశారు. పరిశోధనకు సంబంధించిన అనేక విశేషాలు ఈ పుస్తకాల్లో ఉన్నాయని తెలిపారు. అనంతరం డాక్టర్ అంకె శ్రీనివాస్ మాట్లాడుతూ.. భాషకు సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన చిలుకూరి దేవపుత్ర, ఆచార్య పీఎల్ శ్రీనివాసరెడ్డికి తన పుస్తకాలను అంకితమిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రఖ్యాత చరిత్రకారులు ఆచార్య నాగోలు కృష్ణారెడ్డి, స్పందన కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి, విమర్శకుడు డాక్టర్ నాగేశ్వరరాచారి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ముస్లిం హజ్‌యాత్ర చేయాలి



మాట్లాడుతున్న మౌలానా ఇర్షాద్ అహ్మద్ భాఖవి

అనంతపురం కల్చరల్: ఆర్థికంగా అభివృద్ధి చెందిన ప్రతి ముస్లిం హజ్ యాత్ర చేయాలని మౌలానా ఇర్షాద్ అహ్మద్ భాఖవి అన్నారు. ఆదివారం అరవింద నగర్‌లోని మామూర్ మసీదులో హజ్‌యాత్రపై అవగాహన కార్యక్రమం జరిగింది. హజ్‌యాత్ర ఎవరు చేయాలి?ఎలా చేయాలి? ఆచరించాల్సిన నియమాలు? పాటించాల్సిన పద్ధతులు, నమాజ్ విధానం, ఉమ్రా తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో హజ్ యాత్ర జిల్లా కమిటీ కన్వీనర్ ముస్తాఫా మౌలానా, మత పెద్ద మునీర్, ఉల్మాల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

అయోధ్య అక్షింతల ఊరేగింపు



అక్షింతలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో అయోధ్య అక్షింతలు ఆదివారం స్థానిక హరిహర దేవాలయానికి చేరుకున్నాయి. 111 కలశాలను మోస్తూ జై శ్రీరామ్ నినాదాలతో పూజలు జరిపించారు. ఈ సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్ ప్రతినిధులు, విశ్వహిందూ పరిషత్తు సభ్యులు, అయ్యప్ప మాలధారులు మాట్లాడారు. వచ్చే జనవరి 22న అయోధ్యలోని శ్రీరామ భవ్యమందిరంలో సీతారాముల ప్రాణ ప్రతిష్ఠలు సాగుతాయన్నారు. అనంతరం ఆలయంలో అర్చకులు అయోధ్య అక్షింతలకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వచ్చే నెల 1 నుంచి 10వ తేదీ వరకూ ప్రతి ఇంటికీ అయోధ్య రాముడి దివ్య మందిర చిత్రం, ఆలయ విశేషాల కరపత్రం పంపిణీ చేస్తామని ఆరెస్సెస్ ప్రతినిధులు సుదర్శనరెడ్డి, విశ్వేశ్వరరెడ్డి తెలిపారు.

బకాయిలు విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు

రాప్తాడు: పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు రాయల్ వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, ఉద్యోగులకు చెల్లించాల్సిన బిల్లులు, మెడికల్ బిల్స్‌తో కలుపుకుని రూ.30 వేల కోట్లు రూపాయలపై పైబడి ఉన్నాయన్నారు. పాఠశాలకు కరెంటు పనులు, ఇతర పనులకు కావాల్సిన డబ్బులు విడుదల చేయలేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సబ్–కమిటీ సభ్యులు బొమ్మయ్య, మోహన్ రెడ్డి, భాస్కర్, గాయత్రి, రామాంజినేయులు, డెనియల్, రాష్ట్ర కౌన్సిలర్ అంజలి దేవి, రమణ, చెన్నకేశవులు, సర్దార్ వలి, మంజునాథ్, ధనుంజయ, రామచంద్ర, రాయకులు వన్నప్ప, చితంబర్ రెడ్డి, రవికుమార్, లక్ష్మీనారాయణ, శ్రీనివాస్, మురళి, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎటు చూసినా.. అభివృద్ధే

- జోరుగా సాగుతున్న పనులు
- ఇటీవల పూర్తయిన టవర్‌క్లాక్ బ్రిడ్జి నిర్మాణం
- మరో మూడు, నాలుగు నెలల్లో మరింత అభివృద్ధి



సూర్యా నగర్ సర్కిల్ నుంచి పాత కృష్ణ థియేటర్ వరకూ రూ.1.98 కోట్లతో చేపట్టిన సీసీ రోడ్డు, డివైడర్ల నిర్మాణం



ఎర్రనేల కొట్టాలలో రూ.75 లక్షలతో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అనంత నగరం రూపురేఖలు మారిపోయాయి. మారుమూల ప్రాంతాల నుంచి ప్రధాన రోడ్ల వరకూ ప్రాధాన్యత క్రమంలో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా రూ.వందల కోట్లలో పనులు జరగాయంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం నగరంలో ఎటు చూసినా.. అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయి. ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక చొరవతో పనులు మరింత వేగవంతమయ్యాయి. పాతూరు, వేణుగోపాల్ నగర్, సూర్యా నగర్ సర్కిల్, రెవెన్యూ కాలనీ, విద్యుత్ నగర్, సాయినగర్, కమలానగర్, అంబేడ్కర్ నగర్, రాణినగర్, అశోక్ నగర్, ప్రశాంతినగర్, కోవూర్‌నగర్, లక్ష్మీనగర్, హౌసింగ్ బోర్డు, ఇలా నగరంలోని 50 డివిజన్లలో అభివృద్ధి పనులు జోరుగా సాగుతున్నాయి. రూ.311.93 కోట్లకు సంబంధించి టవర్‌క్లాక్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం పూర్తయింది. అండర్‌పాస్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. వీటితో పాటు నగరపాలక సంస్థ సాధారణ నిధులు, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు, సీఎం ప్రత్యేక నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో పనులు జరుగుతున్నాయి. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి సంబంధించిన రూ.14.58 కోట్ల నిధులతో మొత్తం 306 అభివృద్ధి పనులను వివిధ ప్రాంతాల్లో చేపట్టారు. అందులో 234 పనులు (రూ.12 కోట్లు) పూర్తి కాగా, 12 పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. మరో 60 అభివృద్ధి పనులు ప్రారంభం కావాల్సి ఉంది. సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లకు సంబంధించి 19 ప్యాకేజీల్లో రూ.7 కోట్ల వరకు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మిగితా పనులు జరుగుతున్నాయి. అదేవిధంగా అమృత్ స్కీం కింద నగరంలో చేపట్టిన బ్రిడ్జ్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. సాయినగర్ 8వ క్రాస్, అశోక్‌నగర్ ప్రాంతంలోని బ్రిడ్జ్ పనులు పూర్తి అయ్యాయి. రానున్న రోజుల్లో బ్రిడ్జ్‌ను పూర్తి స్థాయిలో ప్రారంభించనున్నారు. మొత్తం రూ.21 కోట్లతో ఆరు బ్రిడ్జ్‌లు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటికే మూడు బ్రిడ్జ్‌ల నిర్మాణం పూర్తయింది.

రోడ్డు వేశారు



మా ప్రాంతంలో అప్పుడెప్పుడో వేసిన రోడ్లు గుంతలమయంగా మారాయి. అయితే గత ఏడాదిన్నరలో చాలా మార్పు వచ్చింది. గుంతలమయంగా ఉన్న రోడ్ల స్థానంలో కొత్త రోడ్లు వేశారు. చాలా సంతోషంగా ఉంది. విశాలవంతంగా వేసిన రోడ్లతో కాలనీల అభివృద్ధి జరుగుతుంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ధన్యవాదాలు. - లక్ష్మమ్మ, ఎర్రనేల కొట్టాల

మారిన నగర ముఖచిత్రం



గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.14.58 కోట్లతో 80 శాతం పనులు పూర్తి చేశాం. అందులో పాతూరు, రాణినగర్, వినాయక నగర్‌లాంటి ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, తదితర అభివృద్ధి పనులు జరిగాయి. సీఎం ప్రత్యేక నిధులు రూ.25 కోట్లతో ప్రధానమైన రోడ్లు, కాలువలను నిర్మించేలా చర్యలు తీసుకున్నాం. ఎస్క్యాప్ నిధులు రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. 15వ ఆర్థిక సంఘం నిధులు ఏటా రూ.9 కోట్ల వరకూ వస్తున్నాయి. నిధులు సకాలంలో విడుదల అవుతుండటంతో కాంట్రాక్టర్లు ముందుకొస్తున్నారు. అభివృద్ధి పనులతో నగర ముఖచిత్రం మారిపోయింది. - భాగ్యలక్ష్మి, కమిషనర్, నగరపాలక సంస్థ

5 వేల మందికి ఇళ్ల పట్టాలు



పట్టాలు తీసుకునేందుకు వచ్చిన మహిళలు



మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

- రూ.40 కోట్ల విలువైన ఆస్తులు పంచబోతున్నాం
- త్వరలో పీఏబీఆర్ నీరు తీసుకొస్తాం
- నిజాయితీగా నియోజకవర్గ అభివృద్ధికి కష్టపడుతున్నా
- ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడురూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో అనంతపురం రూరల్ మండలంలో 5 వేల మంది నిరుపేదలకు రూ.40 కోట్ల విలువైన ఆస్తులు (ఇంటి పట్టాలు, నిర్మాణం) పంచబోతున్నామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా ఆదివారం పాపంపేటలో నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందజేశారు. పాపంపేట, కట్టకిందపల్లి, కొడిమి, నరసనాయనికుంట, ఆలమూరు, చిన్నంపల్లి, కామారుపల్లి పంచాయతీల్లో 572 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రెండేళ్ల కిందటే ఈ పట్టాలు పంపిణీ చేయాల్సి ఉండగా టీడీపీ వారు కోర్టుకు వెళ్లి స్టేలు తేవడంతో ఆలస్యమైందన్నారు. మహిళలను లక్షాధికారులను చేయాలని జగనన్న తపన పడుతున్నారని గుర్తు చేశారు. 'బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' అంటూ గ్రామాల్లో తిరుగుతున్న టీడీపీ వాళ్లు 2014 ఎన్నికల ముందు ఎన్ని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంత మోసం చేశారో ఒకసారి గుర్తు తెచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను నిజాయితీగా నియోజకవర్గ అభివృద్ధికి కష్టపడుతున్నట్లు తెలిపారు. విద్యారణ్యనగర్‌లోని శ్రోత్రియం భూముల్లో పేదలు ఇళ్లు కట్టుకుంటే దానికి పరిటాల రవీంద్ర నగర్ అని బోర్డు పెట్టారన్నారు. పట్టాల పేరుతో 300 ఇళ్ల నుంచి లక్ష రూపాయల నుంచి 3 లక్షల వరకూ వసూలు చేశారని ఆరోపించారు.

అన్ని గ్రామాల్లో అభివృద్ధి..

రూరల్ మండలంలోని గ్రామాల్లో రోడ్లు, కాలువలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూరల్ మండలంలో వంద కిలోమీటర్ల రోడ్లు, డ్రైన్లు వేయాలనే టార్గెట్ పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగా ప్రతి గ్రామంలోనూ రోడ్లు వేయించామన్నారు. కొడిమి, కట్టకిందపల్లి, చియ్యేడు, పూలకుంట, ఉప్పరపల్లి, కృష్ణంరెడ్డిపల్లి, కందుకూరు, అక్కంపల్లి, నారాయణపురం–నాగిరెడ్డిపల్లి గ్రామాలకు తారురోడ్లు వేయించామన్నారు. పరిటాల సునీత టెండరు తీసుకున్న ముండబండపల్లి తదితర రోడ్లు మాత్రమే పెండింగ్ ఉన్నాయన్నారు. ఇంటర్నల్ రోడ్లు పెద్ద ఎత్తున వేస్తున్నామన్నారు. పాపంపేట, కొడిమి, నరసనాయనికుంట, ఆలమూరు, కట్టకిందపల్లి, చిన్నంపల్లి, కామారుపల్లి పంచాయతీల్లో రెండు విడతల్లోనూ 1,697 ఇళ్ల స్థలాలను పంచామన్నారు.

గార్మెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు చర్యలు..

రూరల్ మండలానికి అతి త్వరలోనే పీఏబీఆర్ నీరు తీసుకొచ్చి తీరుతామన్నారు. పీఏబీఆర్ నుంచి పాపంపేట వరకు ప్రత్యేక పైపులైన్ నిర్మాణానికి రూ.95 కోట్లు మంజూరు చేయించామన్నారు. పెన్నహోబిలం రిజర్వాయర్ నుంచి ఆత్మకూరు, వడ్డుపల్లి, కురుగుంట మీదుగా పాపంపేట వరకు పైపులైను ఏర్పాటు కానుందని, టెండర్లు కూడా పూర్తయినట్లు వెల్లడించారు. త్వరలో గార్మెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పట్టాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వరలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్, మార్కెట్‌యార్డ్ చైర్మన్ బొడదూరి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ పుల్లయ్య, తహశీల్దార్ విజయలక్ష్మి, నాయకులు ధనుంజయయాదవ్, పార్టీ మండల కన్వీనర్ రాధమ్మ, జేసీఎస్ మఠం శ్యాంసుందర్, కామారుపల్లి లోకనాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు వెంకటేశ్వర్లు, సందీప్ యాదవ్, మాజీ ఎంపీటీసీ అపర్ణ, మాదన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ఆర్యవైశ్యుల అభివృద్ధి



మల్లికార్జునను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

అనంతపురం కల్చరల్: వైఎస్సార్‌సీపీతోనే ఆర్యవైశ్యుల అభివృద్ధి సాధ్యమని ఆర్యవైశ్య సంఘం జిల్లా నాయకుడు, కార్పొరేటర్ గూడూరు మల్లికార్జున అన్నారు. వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం సెక్రటరీగా ఎంపికైన గూడూరు మల్లికార్జునను జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదివారం రాత్రి సత్కరించారు. ఆర్యవైశ్య సంఘం వారి ప్రతిభను గుర్తించి ఉన్నత పదవులు కేటాయించడంపై ఆనందం వ్యక్తం చేశారు. అంతకు ముందు వాసవీమాతకు పూజలు చేశారు. స్థానిక కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు నేతృత్వంలో వాసవీ యువజన సంఘం, వాసవీ దీక్షా సంఘం, మహిళా విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎరా ఇంటర్నేషనల్ స్కూల్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న స్కూల్ చైర్మన్ అరుణ్‌కుమార్ రెడ్డి

అనంతపురం రూరల్: బ్రెయిన్ ఫీడ్ సంస్థ చేపట్టిన సర్వేలో తమ పాఠశాలకు ప్రథమ బహుమతి లభించినట్లు ఎరా ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ అరుణ్ కుమారెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లో అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమారెడ్డి మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ఉన్న టాప్ 500 ఇంటర్నేషనల్ స్కూళ్లలో బ్రెయిన్ ఫీడ్ సంస్థ సర్వే చేపట్టిందన్నారు. ఈ సర్వేలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంలో తమ పాఠశాల ప్రథమం స్థానంలో నిలిచిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: నగరంలోని ద్వారకనగర్ నారాయణ హైస్కూల్‌లో విద్వాన్ విశ్వం విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం 'జాతీయ జెండా', 'ఉపాధ్యాయుడు ఉజ్వల భవిష్యత్తు' అనే అంశాలపై 'వ్యాసరచన', 'వక్తృత్వ', 'డ్రాయింగ్', 'రిడ్–రైట్' పోటీలు నిర్వహించారు. కార్యక్రమాన్ని చిన్నారి ఆస్పత్రి డాక్టర్ హరి ప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో విద్వా విశ్వం విజ్ఞాన కేంద్రం ఏజీ రాజమోహన్, కో–కన్వీనర్ శ్రీనివాసరావు, నారాయణ స్కూల్ టీచరు హస్మా, జేవీవీ ముత్యాలు, యూటీఎఫ్ జిలాన్, విరూపాక్ష, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

అనంతలో అనసూయ



సినీనటి అనసూయ భరద్వాజ్ అనంతపురంలో సందడి చేసింది. నగరంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం విచ్చేసిన ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. – సాక్షిఫోటోగ్రాఫర్:

జీవితాన్ని ఉల్లాసంగా గడపాలి



మాట్లాడుతున్న మానవతా సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి

అనంతపురం కల్చరల్: వృద్ధాప్యంలో సమస్యలను పట్టించుకోకుండా ఏదో ఒక వ్యాపకంతో జీవితాన్ని ఉల్లాసంగా ఆస్వాదించాలని మానవతా రక్తదాతల సంస్థ కన్వీనర్ తరిమెల అమరనాథరెడ్డి అన్నారు. ఆదివారం పలుచోట్ల అఖిల భారత పెన్షనర్ల దినోత్సవ వేడుకలు జరిగాయి. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో జరిగిన కార్యక్రమానికి తరిమెల అమరనాథరెడ్డి, విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పతికి రమేష్‌నారాయణ, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అబ్దుల్ సత్తార్, పారిశ్రామిక వేత్త ముదార్ సుదీర్, సుజాతమ్మ, సీఏ ప్రవీణ్, కవి రియాజుద్దీన్ అహ్మద్, సామాజిక సేవా కార్యకర్త సలీం మాలిక్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు విశ్రాంత ఉద్యోగులు చక్కటి గీతాలను ఆలపించారు. ముఖ్య అతిథులను జ్ఞాపికలతో సన్మానించారు. అదేవిధంగా లలిత కళాపరిషత్తులో పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దన్న గౌడ్, శీలా జయరామప్ప తదితరులు పెన్షనర్ల సమస్యలను వినిపించారు.

అనంతపురం సిటీ: అనంతపురంలో ప్రపంచ పెన్షనర్ల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ శాఖ రిటైర్డ్ జీఎం వెంకటనారాయణ అధ్యక్షత వహించారు. ప్రస్తుత జీఎం ముజీబ్ పాషా, డీజీఎం బాలగంగాధర్ రెడ్డి, ప్రముఖ కంటి వైద్య నిపుణుడు డాక్టర్ అక్బర్ సాహెబ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు. మీనాక్షమ్మ సమ్మిళిత వికాస్ వద్ద అనాథ పిల్లలకు పండ్లు, నగదు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఏసీఎం సుభాన్, బ్రాంచ్ సెక్రటరీ హరినాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప గ్రామోత్సవం



హారతులు పట్టిన మహిళలు



గ్రామోత్సవంలో వివిధ వేషధారణల్లో అయ్యప్ప భక్తులు

అనంతపురం కల్చరల్: అయ్యప్పస్వామి నామస్మరణతో నగర వీధులు మార్మోగాయి. మొదటి రోడ్డు కాశీ విశ్వేశ్వరాలయంలో కొలువైన అయ్యప్ప దేవాలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి వందలాది అయ్యప్ప మాలధారులు పురవీధుల్లో స్వామిని ఊరేగించారు. సుందరంగా అలంకరించిన పూలరథంపై కొలువుదీరిన అయ్యప్పకు భక్తులు పూజలు చేశారు. అనంతరం శివాలయంలో లక్ష్మీరెడ్డి, శ్రీనివాస గురుస్వాముల నేతృత్వంలో భిక్ష, తీర్థప్రసాద వితరణ జరిగింది. ప్రత్యేక పూజల్లో ఆలయ ఈఓ, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంతల ఆదాయం రూ.4.25 లక్షలు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో జీవాల సంతల ద్వారా రూ.4.25 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు చైర్మన్ ఫయాజ్ బాషా, సెక్రెటరీ ఆర్.జయలక్ష్మి తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత నుంచి రూ.2,21,990, ఆదివారం జరిగిన పశువుల సంత నుంచి రూ.2,04,000 వసూలైనట్లు పేర్కొన్నారు.

రేమా చర్చిలో ప్రీ క్రిస్మస్ సందడి

అనంతపురం కల్చరల్: ఆధ్యాత్మిక బాటలో నడుస్తూ ఆత్మవిశ్వాసం పెంచుకున్న వారు ఉన్నత జీవితాన్ని ఆస్వాదిస్తారని రెవరెండ్ జాన్ మోజెస్ అన్నారు. ఆదివారం స్థానిక కళాకారుల కాలనీలోని రేమా చర్చిలో ప్రీ క్రిస్మస్ వేడుకలు సందడిగా జరిగాయి. సంఘం కాపరి పాస్టర్ మనుష్యే నేతృత్వంలో జరిగిన వేడుకలకు విజయవాడ నుండి విచ్చేసిన సువార్తికులు రెవరెండ్ జాన్ మోజెస్ వాక్య పరిచర్య చేశారు. బైబిల్‌లోని వివిధ ఘట్టాలను వివరించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. క్రీస్తు జీవిత విశేషాలను వర్ణిస్తూ సాగిన కోయర్ బృందాల ఆటపాటలు భక్తిభావాన్ని పెంచాయి. అనంతరం చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు ద్వారక, సారిక తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ హయాంలో ప్రభుత్వ సంస్థల నిర్వీర్యం'

అనంతపురం అర్బన్: ప్రభుత్వరంగ సంస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఎస్‌యూసీఐ పార్టీ రాష్ట్ర క్యాదర్శి బి.ఎస్.అమర్‌నాథ్ విమర్శించారు. ప్రభుత్వాల విధానాలను నిరసిస్తూ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర అధ్యక్షతన ఆదివారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అమర్‌నాథ్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం పని చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకురాలు లలిత, నాయకులు సుబ్రమణ్యం, తబ్రెజ్, నాగరాజు, కిషోర్, మహేష్, నరేంద్ర, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకులపై చర్యలు తీసుకోండి

అనంతపురం టవర్‌క్లాక్: తమకు చెందిన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని బాధితులు నాగలక్ష్మి, సుధాకర్, తేజశ్విని, వెంకట నారాయణ కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. అనంతపురం రూరల్ పరిధిలోని కురుకుంటలో సర్వేనెంబర్ 41లో 21.82 ఎకరాల భూమి తమ తాతల కాలం నుంచి వారసత్వంగా వచ్చిందన్నారు. అయితే సర్వే నంబర్ 41–1లో ఎమ్మార్పీఎస్ నాయకులకు దాదాపు 290 పట్టాలను ప్రభుత్వం ఇచ్చిందన్నారు. వీరిలో అనర్హులు ఉన్నారంటూ ఈ పట్టాలను ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. అయితే తమకు చెందిన భూమిని ఆక్రమించేందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. వారి నుంచి ప్రాణహాని కూడా ఉందని తెలిపారు. పోలీసులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సురేష్, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాలకావడి ఉత్సవాలు

ఆత్మకూరు: పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పలు పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ అక్కిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం షష్ఠి సందర్భంగా ఉదయం 8 గంటలకు పాలకావడి ఉత్సవం, 9 గంటలకు సర్వసూక్త పాలాభిషేకం, పంచామృతాభిషేకం, 10 గంటలకు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవం, 11 గంటలకు బంగారు కవచ సేవ, 11:30 గంటలకు మంత్ర పుష్పము, 3 గంటలకు గ్రామోత్సవం, 4:30 గంటల నుంచి నగరోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఆలయాన్ని ప్రత్యేకంగా పూలు, వివిధ రకాల ఆకులతో ప్రత్యేకంగం అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర యాగం

అనంతపురం కల్చరల్: యాగాలలో కెల్లా విశిష్టమని చెప్పబడుతున్న బృహతీ సహస్ర యాగం ఆదివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. స్థానిక పాతూరు ఉత్తరాధి మఠంలో కర్ణాటక మఠాల నుంచి వచ్చిన రుత్వికులు అనంతాచార్ అకుమంచి ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా విశేష పూజలు, యాగం నిర్వహించారు. ముఖ్యంగా పిండితో నిలువెత్తు గరుడవాహనాన్ని యాగశాలలో ఏర్పాటు చేసి చేసిన పూజలు భక్తిభావాన్ని పెంచాయి. మఠం నిర్వాహకులు హరి ఆచార్, వినోదాచార్, కృష్ణారావు, సీనియర్ న్యాయవాది ఆదోని గురుప్రసాద్ పాల్గొన్నారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
1) APE XTRA LDX PU BSVI 2021 MODEL AP39 TY 1747
2) MAHINDRA ALFA DX DIESEL BSVI 2022 MODEL AP39 UG 5148
3) MAHINDRA ALFA DX DIESEL BSVI 2022 MODEL AP39 UJ 8659
Cell : 70329 75897
11/168-2, 2nd Floor, Meda Ramaiah Setty Mansion, Back Side Meda Petrol Bunk, Sapatagiri Circle, ANANTHAPUR.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724, 9010223702, 9010567770, 9010588846, 9912220727